క్లుప్తంగా

సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న హెచ్.వై.దొర

పలాస: సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని పలాస-కాశీబుగ్గ లయన్స్ క్లబ్ అధ్యక్షులు హెచ్.వై.దొర అన్నారు. జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా కాశీబుగ్గ విద్యావాహిని కళాశాల ఆవరణలో శనివారం జరిగిన 'సోషల్ మీడియా- వాటి పరిణామాలు'అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సోషల్ మీడియా చాలా శక్తివంతమైనదన్నార. వాటిని రాజ్యాంగం కల్పించిన భావ స్వాతంత్ర్యం అని గుర్తించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాటిని మరిచిపోయి తప్పుడు పద్ధతుల్లో పోస్టులు పెట్టకూడదన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ అధ్యక్షుడు సీహెచ్ జగదీష్, పలాస-కాశీబుగ్గ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు సీహెచ్ నేతాజీ, సంపత్‌రావు జయంతికుమార్, కొంచాడ రవిశంకర్, నాగరాజు, మేఘన, అంబికా ప్రసాద్ పాల్గొన్నారు.

కొలతల ప్రకారమే వేతనాల చెల్లింపు

సాక్షి ఎఫెక్ట్...

పలాస: మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో జరుగుతున్న పనులకు సంబంధించి కొలతల ప్రకారమే వేతనాలు చెల్లిస్తున్నామని పలాస ఏపీవో శంకరరావు చెప్పారు. 'పొట్ట నింపని ఉపాధి' శీర్షికతో శనివారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించారు. పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతనదారుడు ఎంత పనిచేస్తే అంతే వేతనం గిట్టుబాటు అవుతుందని.. అదనంగా ఇవ్వలేమన్నారు. కనీసం వేతనం రూ.300 ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. అయితే వాటికి కూడా నిబంధనలు ఉన్నాయని.. ఆ మేరకే వేతనాలు చెల్లిస్తున్నామన్నారు.

ముగిసిన ముస్లింల సమ్మేళనం



అల్లా బోధనలు వివరిస్తున్న మతపెద్దలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నెమలికొండ ప్రాంతంలో రెండు రోజులుగా జరుగుతున్న ముస్లిం సమ్మేళనం (ఈస్తెమా) శనివారంతో ఘనంగా ముగిసింది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ముస్లింలు నివశించే గ్రామాల నుంచి, పలు మసీదు పరిధిలోని ముస్లిం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. నిజాముద్దిన్, పూరీ నుంచి వచ్చిన మతపెద్దలు అల్లా బోధనలు, ఆచరించే పద్ధతులు, ముస్లింల ఐక్యత కోసం పలు ప్రవచనాలు చేశారు. హాజరైన వారందరికీ దావత్ ఇస్తూ సాయంత్రం ప్రార్థనలతో ముగించారు.

విద్యార్థులతో ముఖాముఖి



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం: పురపాలకసంఘం పరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులతో సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పాఠశాలలో నెలకున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచిచూశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం కార్యదర్శి చల్లా దేవరాజు, కౌన్సిలర్ జగన్ ఉన్నారు.

డొంకూరు సీఎఫ్ మార్పు

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు సీఎఫ్‌గా విధులు నిర్వహిస్తున్న చిక్కాల వరలక్ష్మిని తొలగించినట్లు ఇన్‌చార్జి ఏపీఎం సనపల ప్రసాదరావు తెలిపారు. ఆమె పనితీరు సక్రమంగా లేదన్న స్వయం సహాయక సంఘాలు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శనివారం గ్రామంలో 42 సంఘాల సభ్యుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా 40 సంఘాల సభ్యులు ఆమె తీరు బాగోలేదని చెప్పడంతో విధుల నుంచి తక్షణమే తొలగించారు. సంఘ సభ్యుల కోరిక మేరకు బి.లక్ష్మిని వీవోఏగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్ ముఖలింగం పాల్గొన్నారు.

ఘనంగా గారపోలమ్మ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో కొలువైన గార పోలమ్మ అమ్మవారి 32వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలో 555 మంది మహిళలు పాల్గొన్నారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వంశ'ధార' పారేదెలా?

- శిథిలమైన యూటీ, ఓటీ, అక్విడెక్ట్
- తుప్పపట్టిన కాలిబాట వంతెనలు
- శివారు ఆయకట్టు రైతుల అవస్థలు



పొల్లాడ ప్రాంతంలో శిథిలమైన స్లూయిస్

వజ్రపుకొత్తూరు: రైతుల జీవనాడి వంశధార రిజర్వాయర్. వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేసే ఈ సాగునీటి వనరు నేడు రూపం కోల్పోతోంది. అసలే శివారు ప్రాంతం. ఎప్పుడో ఏళ్లనాటి కట్టడాలు. తుప్పు పట్టిన షట్టర్లు ప్రస్తుతం ఆందోళన కలిగిస్తున్నాయి. కాలిబాట వంతెనలు శిథిలమై రూపును కోల్పోయాయి. భయంకరంగా కనిపిస్తున్న వంశధార కాలువల్లో సాగునీరు గలగల పారాలంటే భగీరథ ప్రయత్నమే చేయాల్సిన పరిస్థితి. కాలువల ఆధునికీకరణకు ప్రభుత్వం పైసా విదల్చక పోవడంతో శివారు ఆయకట్టు రైతులు సాగునీరు అందక పంటలను కోల్పోయి నష్టాన్ని చవిచూస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలించాయి కాబట్టి సరిపోయింది. లేకుండా ఇలాంటి కాలువలు వల్ల శివారుకు చుక్క నీరు చేరదనేది వాస్తవం.

ఆధునికీకరణ ఏదీ?

ఖరీఫ్‌కు సాగునీరు అందించాలంటే రూపు కోల్పోయిన కాలువలు, శిథిలమైన యూటీ, ఓటీ, అక్విడక్ట్, స్లూయిస్, సర్‌ప్లస్ వీయర్లలను వేసవి కాలంలోనే కొత్తగా నిర్మించాలి. లేకుంటే కనీసం మరమ్మతుల చేపట్టాలి. కానీ 48 ఏళ్ల కిందట నిర్మించిన కాలువలకు నేటి వరకు ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. వంశధార పలాస సబ్ డివిజన్‌లో నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల శివారు ప్రాంతాలకు సాగు నీరు చేరాలంటే 60-ఆర్, 60-ఆర్ఎల్, 5-ఎల్, 9-టీఈ, బెండి చానెల్, 60-ఆర్ఎల్ మర్రిపాడు చానెల్‌లు ప్రధానం. వీటిపై ఉండే యూటీ, ఓటీ, అక్విడక్ట్, స్లూయిస్, సర్‌ప్లస్‌వీయర్, షట్టర్‌లు ప్రస్తుతం శిథిలమయ్యాయి. చుక్క నీరు కాలువలో పారని పరిస్థితి ఉంది.



సుంకరజగన్నాథపురం వద్ద పాడైన షట్టర్ కింద నుంచి పారుతున్న నీరు

కానరాని నడక దారి

వంశధార కాలువ ఎగువ, దిగువ ప్రాంతాల రైతులు వ్యవసాయ పనులకు తమ పొలాలకు పోవాలంటే నడకదారి వంతెనలు కీలకం. వంశధార షట్టర్ల కుంభకోణం బయట పడగానే అప్పట్లో దాదాపు రూ.12 కోట్లు వరకు వెచ్చించి 22 చోట్ల చెరువులు, కాలువలపై షట్టర్‌లు, నాణ్యత లేని ఐరన్ వంతెనలు ఆగమేఘాల మీద నిర్మించడంతో ప్రస్తుతం అవి తుప్పుపట్టి శిథిలమైయ్యాయి. దీంతో రైతులు వరిచేను తరలించేందుకు, వ్యసాయ పనులకు వెళ్లేందుకు వ్యయా ప్రయాసలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి సమస్యలను పరిష్కరించి ఆయకట్టుకు సక్రమంగా సాగునీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



హరిదాసుపురం వద్ద తుప్పపట్టి శిథిలమైన ఐరన్ వంతెన

సాగునీరు అందలేదు..



సాగునీరు అందక ఇబ్బంది పడ్డాం. వరిచేను కంకులు పోసుకుని ఉన్న సమయంలో వంశధార ద్వారా సాగునీరు అందలేదు. మదుములు, షట్టర్‌లు, సర్‌ప్లస్ వీయర్‌లు, యూటీలు శిథిలమైయ్యాయి. వాటిని బాగు చేయాలని వంశధార అధికారులను కోరాం. ఎక్కడెక్కడ శిథిలమైన పనులు ఉన్నాయో వారికి చూపించాం. వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తే తప్పా మా ప్రాంతానికి సాగు నీరు రాదు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– బి.రామరావు రైతు, పొల్లాడ

మరమ్మతులు చేపట్టాలి



మా ప్రాంతానికి వచ్చే బెండి చానెల్ 60ఆర్ఎల్, 5ఎల్ కాలువల మరమ్మతులు చేపట్టాలి. కాలువల్లో పూడిక తీయాలి. పాడైన స్లూయిస్, యూటీలు బాగు చేయాలి. శివారు ప్రాంతానికి నీరు చేరే వరకు కాలువలను ఆధునికీకరించి పర్యవేక్షిస్తే తప్పా మాకు నీరు చేరదు. లేకుంటే మదనగోపాల సాగరం.. లేదా వేరే మార్గం ద్వారా శివారు ఆయకట్టుకు సాగునీరు చేరేలా ప్రభుత్వం చొరవ చూపాలి.

-జి.జగన్నాయకులు, రైతు, తుంభవానిపేట

ప్రతిపాదనలు పంపాం

టెక్కలి డివిజన్ పరిధిలోని వంశధార కాలువల ఆధునికీకరణకు ప్రతిపాదనలు పంపాం. రూ.900 కోట్లు అవసరం. 16వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి పనులు చేపట్టాలని ప్రభుత్వానికి నివేదిచాం. మంజూరు కాగానే పూర్తిగా కాలువులను ఆధునికీకరిస్తాం. అయితే ఇందులో షట్టర్‌లు, ఇనుప వంతెనలకు ప్రతిపాదనలు చేయలేదు. దానిపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి

– టి.రాజశేఖర్ రాజు, ఏఈఈ, వంశధార ప్రాజెక్టు

ప్రోటోకాల్ పాటించరా?

- మండల సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు వసంతరెడ్డి

సంతబొమ్మాళి: గ్రామస్థాయిలో జరిగే సమావేశాలకు, ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని, ప్రోటోకాల్ పాటించరా అని జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి అధికారులను ప్రశ్నించారు. ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ప్రోటోకాల్ పాటించకపోతే వచ్చే సమావేశంలో అధికారులకు తమ తడాఖా చూపిస్తామని మేఘవరం ఎంపీటీసీ సభ్యుడు రాజారావు హెచ్చరించారు. జలజీవన మిషన్ ద్వారా 215 పనులు మంజూరైటన్టు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఆర్.మహేష్ తెలిపారు. మేఘవరం పంచాయతీలో విద్యుత్ బల్బులు, కాలువలో పూడికతీతలు తీస్తే బిల్లులు మంజూరు చేయవద్దని టీడీపీ కార్యకర్తలు చెబితే బిల్లులు ఆపేశారని మేఘవరం సర్పంచ్ పరపటి సునీతరెడ్డి నిలదీశారు. బిల్లులు మంజూరుకు కృషి చేస్తామని ఎంపీడీవో జయంతి ప్రసాద్ సమాధానం ఇచ్చారు. రుంకు హనుమంతుపురం పంచాయతీలో ఎరువులు, విత్తనాలు పంపిణీ చేసినప్పుడు తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని సర్పంచ్ ఎన్ని మన్మథరావు వ్యవసాయశాఖ అధికారి ఆర్.అప్పారావును నిలదీశారు. పంచాయతీరాజ్ జేఈ కె.రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. 34 పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా 184 పనులకు రూ. 15 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. ఉపాధి హామీ పథకం ఏపీవో నరసింహమూర్తి మాట్లాడుతూ.. పల్లెవనం ద్వారా ఎం.సున్నాపల్లి, ఉమిలాడ తీరప్రాంతంలో ఆట స్థలం చుట్టూ మొక్కలు నాటామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పొందల తులసమ్మ, అడ్మినిస్ట్రేటివ్ అఫీసర్ యు.కె.పట్నాయక్, ఎంఈవో చిన్నవాడు పాల్గొన్నారు.

బాలి యాత్ర విజయవంతం చేయండి..

కోటబొమ్మాళి: జలుమూరు మండలం శ్రీముఖలింగంలో ఆదివారం మధ్యాహ్నం జరగనున్న కళింగ సీమ ప్రాచీన సంప్రదాయమైన బాలియాత్ర పునఃప్రారంభ కార్యక్రమానికి కోటబొమ్మాళి మండలంలోని 38 పంచాయతీలకు చెందిన ప్రజానీకం హాజరై జయప్రదం చేయాలని మండల బాలియాత్రా ప్రచారకర్త సంపతిరావు హేమసుంధరరాజు కోరారు.

కాశీబుగ్గ: శ్రీముఖలింగంలో నిర్వహించనున్న బాలి యాత్రను జయప్రదం చేయాలని యాత్ర నిర్వహణ కమిటీ ప్రతినిధి డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు కోరారు. అతిపురాతన జాతరకు పునర్జన్మను ఇవ్వాలన్నారు.

అంతర పంటల సాగు లాభదాయకం



రైతు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కవిటి: కవిటి ఉద్దానం ప్రాంతంలో కొబ్బరిలో అంతర పంటలసాగు ఎంతో లాభదాయకమని శాస్త్రవేత్తలు, అధికారులు అన్నారు. బల్లిపుట్టుగలో శనివారం రైతు శిక్షణ కార్యక్రమాన్ని రాగోలు కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ అనుష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కొబ్బరిలో వచ్చే సర్పిలకర తెల్లదోమ, గానొడర్మ, ఎర్రముక్కు, నల్లముట్టు పురుగుల నివారణ పద్ధతులు వివరించారు. సోంపేట ఏడీఏ జగన్మోహన్ మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో రాగులు, నువ్వులు, పెసర, మినుము విత్తనాలు సబ్సిడీపై రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. కవిటి ఉద్యానాధికారిణి పోలాకి మాధవీలత మాట్లాడుతూ.. కొబ్బరిలో అంతరపంటగా కోకో పంటను వేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి దుర్గాప్రసాద్, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, వీహెచ్ఏలు జగదీష్, సింహాచలం, ఏంపీఈవోలు లలిత, విష్ణువర్ధన్ ఉన్నారు.

నాయకుల పరామర్శ



దేవరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు కాళ్ల దేవరాజు ఇటీవల మృతి చెందారు. దీంతో అతని కుటుంబ సభ్యులను జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ శనివారం పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



వివేకానందరెడ్డి సోదరులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండల ఉపాధ్యక్షుడు దువ్వు వివేకానందరెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు శనివారం పరామర్శించారు. వివేకానందరెడ్డి మరదలు సుప్రియ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆయన ఈదుపురం వెళ్లి మృతురాలు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి సంతాపం తెలియజేశారు. సర్పంచ్ నీలాపు సారథి రెడ్డి, వీఆర్వో ఉప్పాడ రాజారెడ్డి, రాపంత్ని చిట్టిబాబు. హంగీర్ బెహరా, గణపతి ఉన్నారు.

విత్తనోత్పత్తి పథకంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు



విత్తనోత్పత్తి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

సోంపేట: విత్తనోత్పత్తి పథకం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయడం జరుగుతుందని వ్యవసాయాధికారి బి.నర్సింహామూర్తి అన్నారు. బారువ గ్రామంలో విత్తనోత్పత్తి క్షేత్రాన్ని వ్యవసాయధికారి శనివారం సందర్శించారు. బారువ, తాళభద్ర, కర్లలిపాలెం, సుంకిడి, పాత్రకొండ, మాకన్నపురం గ్రామాల్లో విత్తనోత్పత్తి పథకాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. బారువ విత్తనోత్పత్తి క్షేత్రం వద్ద విత్తన తయారీపై రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. వ్యవసాయ సహాయకులు పవిత్ర, లోలాక్షి ఉన్నారు.

గ్రంథ పాలకుడులేని గ్రంథాలయం!

- మంత్రి ఇలాకాలో కానరాని గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయా సూరమ్మ

కోటబొమ్మాళి: రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత మండల కేంద్రమైన కోటబొమ్మాళిలోని గ్రంథాలయానికి ఐదు నెలలుగా గ్రంథాలయాధికారి లేరు. ఈ కారణంగా ప్రస్తుతం జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహణకు నోచుకోలేదు. ఇక్కడ పని చేసిన బ్రహ్మయ్య అనారోగ్యంతో ఐదు నెలల క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి లైబ్రేరియన్‌ను నియమించలేదు. దీంతో ప్రైవేటు ఆయాగా పనిచేస్తున్న సూరమ్మ అప్పటి నుంచి గ్రంథాలయంను తెరుస్తూ ఆ బాధ్యతను నిర్వహిస్తోంది. నెలలు గడిచినా గ్రంథిలయాధికారిని నియమించకపోడంతో పాఠకుల నుంచి అసంతృప్తి వ్యక్తమౌతోంది. సంబంధిత అధికారులు స్పందించి లైబ్రేరియన్‌ను నియమించాలని పాఠకులు కోరుతున్నారు.

భుసార పత్రాలు అందజేత



భుసార పరీక్ష పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: భుసార పరీక్షలతో రైతులకు మేలు జరుగుతోందని టెక్కలి వ్యవసాయశాఖ ఏడీ బి.వి.తిరుమలరావు అన్నారు. నిమ్మాడ గ్రామంలో రైతులకు భుసార పరీక్షా పత్రాలను శనివారం అందజేశారు. కోటబొమ్మాళి వసాయాధికారి ఎస్.గోవిందరావు, వీవోపి ఎస్.గోవిందరావు పాల్గొన్నారు.

కార్యాలయానికి చెదలు..



వజ్రపుకొత్తూరు మండల తహశీల్దార్ కార్యాలయం చెదలు పడుతోంది. చాలాఏళ్ల నాటి భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకుంటుంది. కిటికీలు, తలుపులు ఊడి, చెదలు చేరడంతో విలువైన దస్త్రాలకు భద్రత లేని పరిస్థితి నెలకుంది. కార్యాలయం గోడలను ఆనుకొని పాముల పుట్టలు సైతం వ్యాపించాయి. ఇక్కడకు వివిధ పనులపై వచ్చేవారు కార్యాలయం పరిస్థితిని చూసి నివ్వెరపోతున్నారు. కనీసం సిబ్బంది కూడా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. –వజ్రపుకొత్తూరు రూరల్

వెండి ధారపాత్ర వితరణ



ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం ప్రాంగణంలోని ఉపాలయాల్లో కొలువైన భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయానికి పట్టణానికి చెందిన వ్యాపారివేత్త పెద్దబాబు సుమారు రూ. నాలుగు లక్షల వ్యయంతో కిలోల వెండితో తయారు చేసిన ధారపాత్రను వితరణ చేశారు. ఈ మేరకు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

–ఇచ్ఛాపురం

ఆత్మీయ సమ్మేళనం



కవిటి ఉన్నత పాఠశాలలో 1979–80 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదుకున్న పూర్వ విద్యార్థులు కంచిలి మండలంలోని సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువుకున్న రోజులను జ్ఞాపకం చేసుకొని సందడిగా గడిపారు. ఆశ్రమంలో నిత్య అన్నదానం కోసం ఎనిమిది బ్యాగ్‌లు, 48 మంది విద్యార్థులకు దుప్పట్లు, 26 మంది వయోవృద్ధులకు పంచెలు, చీరలు అందజేశారు. 45 సంవత్సరాల తరువాత కలుసుకున్న వారంతా ఆనందం వ్యక్తం చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు పిరియా పద్మనాభం, పులకల మాధవరావు, జె.వి.రమణ, పూడి రామారావు, పిలక జగదీష్ ఉన్నారు.

–కంచిలి

సేవలకు సత్కారం



కాశీబుగ్గ, పలాస పరిసర ప్రాంతాలలో ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకుంటున్న 'ఆ నలుగురు' స్వచ్ఛంద సంస్థకు జాతీయ తెలుగు వెలుగు రత్న అవార్డు దక్కింది. విశాఖపట్నం పౌర గ్రంథాలయం ఆడిటోరియంలో విశాఖరత్న ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమి అవార్డును పలాసకు చెందిన ఆ నలుగురు రక్తదాన సంస్థకు అందించారు. రక్తదానం అవసరం అయితే ఫోన్‌కాల్, మెసేజ్‌తో సేవలందిస్తున్న తీరుతెన్నులను ప్రశంసిస్తూ వ్యవస్థాపక అధ్యక్షులు పిచ్చుకల పాపారావును అభినందించారు. ఈ సంస్థ తరఫున హాజరైన సంస్థ సభ్యులు సానా ఈశ్వరరావుకు సత్కరించి అవార్డును అందించారు.

–కాశీబుగ్గ

సంక్షిప్తంగా...

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సోంపేట: మండలంలోని పలాసపురం పంచాయతీలో సర్పంచ్ తడక జోగారావు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. సామాజిక భవనం శ్లాబ్, సాయిబాబా దేవాలయం వద్ద ఐరన్ గ్రిల్స్ కొత్తవి ఏర్పాటు చేయనున్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగాభిషేకం



గంగాభిషేకానికి వెళ్తున్న మహిళలు

కోటబొమ్మాళి: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం పడిపూజ కార్యక్రమాన్ని పురస్కరించుకొని 500 మంది మహిళలతో గంగాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ముర్రాటలతో స్వామికి అభిషేకాలు చేశారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు



పడిపూజ చేస్తున్న అయ్యప్పస్వాములు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండిలో కొలువైన హరిహర పుత్రుడు అయ్యప్పస్వామికి శనివారం విశేష పూజలు కన్నుల పండువగా జరిగాయి. ఏటా నవంబర్ 16వ తేదీన శబరిమలలో జరిగే పడి పూజలా ఇక్కడ కూడా పడి పూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా స్థానిక ఆలయం వద్ద ఉదయం ఆరు గంటల నుంచి అయ్యప్ప స్వామికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక పెద్దలు పీహెచ్ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. 121 నారికేళ, జల, నెయ్యాభిషేకాలు చేశారు. గురుస్వాములు టి.రాజారావు, కర్ని దశరథరావు తదితర గురు స్వాముల ఆధ్వర్యంలో శరణు గోషల మధ్య స్వాములకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం దాదాపు ఐదు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

వైజ్ఞానిక మహాసభలు విజయవంతం చేయాలి

సోంపేట: మందస మండలం హరిపురంలో ఈ నెల 24, 25 తేదీల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యావైజ్ఞానిక మహాసభలు విజయవంతం చేయాలని ఆ శాఖ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు కోరారు. సోంపేటలో సంఘ గౌరవ అధ్యక్షులు గొరకల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

నూతన కార్యవర్గం

మండల యూటీఎఫ్ శాఖ నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చాప కూర్మారావు, గొరకల దొరబాబు, గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. సంఘ ప్రతినిధులు హేమచంద్రరావు, తేజేశ్వరరావు పాల్గొన్నారు.

జీడిపిక్క ఔన్నత్యాన్ని కాపాడుదాం



జీడిపిక్క బొమ్మ వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని కోరుతూ యువకుల ప్లకార్డుల ప్రదర్శన

కాశీబుగ్గ: పలాస అంటే జీడిపంటకు, జీడి పప్పు ఎగుమతులకు పెట్టిందని పలువురు యువకులు అన్నారు. ఆ పేరును కాపాడుకోవడం అందరి బాధ్యత అంటూ పలాస యువకులు ఫ్లెక్సీలతో శనివారం ప్రచారం చేశారు. జీడిపప్పుకు ప్రతీకగా పలాసలో నిర్మించిన జీడిపిక్క బొమ్మ చుట్టూ ప్లాస్టిక్ ప్లకార్డులు, పెద్దపెద్ద బోర్డులు పెట్టి కనిపించకుండా చేస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇక నుంచి దీని పరిసరాలలో గోడపత్రికలు, ఫ్లెక్సీలు అంటించవద్దని కోరారు. యువకులు సప్ప నవీన్, బోనెల గోపాలరావు, దిలిప్‌కుమార్, ఉమా శంకర్, శంకరరావు, మోహన్ ఉన్నారు.